


**అక్రమ మిల్లర్లకు అధికారులే అండ!**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
సోమవారం | 26 అక్టోబరు , 2026 | పేజీలు : 4

# బోర్డులకే పరిమితం క్రీడా ప్రాంగణం..!

**ప్రజాపక్షం/చింతలపాలెం :** గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ నేటి వరకు నిర్వహణకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయని, క్రీడా సామాగ్రి లేక కేవలం బోర్డులకే పరిమితమయ్యాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా ఒక్కో క్రీడా ప్రాంగణం కోసం రూ.2లక్షల నుండి 5 లక్షల వరకు నిధులను కేటాయించగా, అప్పట్లో సర్పంచులు దగ్గరుండి పనులను పూర్తి చేయించారు. కానీ వాటి నిర్వహణ గాలికి వదిలేయడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా అయ్యింది. ప్రతీ గ్రామంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసి, కోచ్‌ల ద్వారా యువత, చిన్నారులకు శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ముందుకు వెళ్లినప్పటికి, క్షేత్రస్థాయిలో క్రీడా ప్రాంగణాల లక్ష్యం ఆచరణకు ఆమడదూరంలోనే ఆగిపోయింది.




**అలంకార ప్రాయంగా క్రీడాప్రాంగణాలు...**

గ్రామాల్లో అర ఎకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలో ఉండగా చాలా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో గ్రామంలో ఉన్న పాఠశాల ఆట స్థలంలో, ఊరికి దూరంలో ఉన్న కొద్దిపాటి స్థలాల్లో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కానీ గ్రామాల్లో క్రీడా ప్రాంగణం పేరిట బోర్డు నామమాత్రంగానే ఏర్పాటు చేసి వదిలేశారు. కొన్ని చోట్ల కేవలం క్రీడాప్రాంగణం పేరుతో బోర్డులు పెట్టి ఇతరత్రా వసతులను మరిచారు. గ్రామ పంచాయితీ పాలకవర్గం కూడా క్రీడాప్రాంగణాల నిర్వహణపై దృష్టి పెట్టకపోవడం, సరైన వసతులు కల్పించకపోవడంతో గ్రామంలో యువత, క్రీడాకారులు ఆటలు ఆడేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంపై ఆసక్తి చూపడం లేదు. నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వాన్నంగా తయారయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఊరుకు దూరంగా క్రీడాప్రాంగణాలు ఉండడంతో ఒక్కరోజు కూడా క్రీడాకారులు ఆటలు ఆడిన దాఖలాలు ఏ గ్రామంలోనూ లేవు. దీంతో అసాంఘీక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాలుగా మారాయి. కొన్ని గ్రామ పంచాయితీల్లో క్రీడా ప్రాంగణాలు ఉన్నట్లు బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ప్రారంభించిన చాలా మైదానాలు ఇప్పుడు కేవలం బోర్డులకే పరిమితం అవుతున్నాయి. క్రీడా ప్రాంగణం అని బోర్డు నాటిన తర్వాత అధికారులు దాని నిర్వహణను పూర్తిగా విస్మరిస్తున్నారు. దీంతో మైదానమంతా పిచ్చి మొక్కలు, ముళ్లకంపలతో నిండిపోయి ఆటలు ఆడటానికి వీలు లేని విధంగా తయారైంది. మైదానంలో వ్యాయామం చేయడానికి లేదా ఆటలు ఆడటానికి అవసరమైన క్రీడా పరికరాలు, ట్రాక్‌లు సరిగా అందుబాటులో లేవు. తాగునీరు, నీడ, సమతలమైన నేల లేకపోవడంతో సాయంత్రం వేళల్లో క్రీడాకారులు ఇటువైపు రావడం లేదు. కొన్ని చోట్ల పశువుల కాపరులు, అసాంఘీక శక్తులకు ఇవి నిలయాలుగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. క్రీడా ప్రాంగణాల పేరుతో లక్షలాది రూపాయలు వెచ్చించినప్పటికి, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆ నిధులు నీటిమూటలవుతున్నాయని యువత ఆవేదన. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి మైదానాలను శుభ్రం చేయించి, ఆటకు అనుకూలంగా ఉండే ఆట వస్తువులు అందుబాటులో ఉంచాలి. వాలీబాల్, క్రికెట్, రన్నింగ్ ట్రాక్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలి. మైదానాల పర్యవేక్షణకు నిర్దిష్ట కమిటిని ఏర్పాటు చేయాలి. క్రీడా ప్రాంగణంలో స్థలాన్ని కొంతమంది ఆక్రమించి ఇల్లులు కట్టుకోవడం జరిగింది. అలాగే పిచ్చిమొక్కలు, ముళ్లకంపలతో అస్తవ్యస్తంగా మారిన క్రీడా ప్రాంగణం స్థలాలను, ఉన్నత అధికారులు స్పందించి, క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తేవాలని స్థానిక యువత కోరారు.

**క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తేవాలి : షేక్ రియాజ్, పిఇటి తమ్మవరం**

మా ఊళ్లో క్రీడా ప్రాంగణం బోర్డు పెట్టి నెలలు గడుస్తున్నా ఒక్క రోజు కూడా సరైన ఆటలు ఆడలేకపోయాం. చింతలపాలెం గ్రామంలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకొచ్చినట్లయితే యువతీ, యువకులకు ఉదయం సాయంత్రం వేళలో ఆటలు ఆడుకునేందుకు ఉపయోగపడతాయి. క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు పంచాయితీలు కృషి చేయాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మైదానాన్ని శుభ్రం చేయించి, ఆట వస్తువులు అందుబాటులో ఉంచాలి. వాటి పర్యవేక్షణపై అధికారులు దృష్టి సారించాలని కోరారు.

---

## రైతాంగ ప్రయోజనాలే ముఖ్యం..
# జలవివాదాలు వద్దు




డిండి ప్రాజెక్టుకు 0.6 టీఎంసీల కేటాయింపుపై హర్షం

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలి

ప్రాంతీయ విభేదాలు సృష్టించడం సరికాదు

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

## ఆధునిక వ్యవసాయంతోనే
# అన్నదాత అభ్యున్నతి




రాష్ట్రానికి ఆదర్శంగా కట్టంగూర్ ఎఫ్‌పిఒ

ఎఫ్‌పిఒను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దే యోచన

వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి,ఎపిసి కె. సురేంద్ర మోహన్



## మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వల్లపుదాసు సాయి కుమార్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ధర్నా పోస్టర్‌ను ఆయన విష్కరించి మాట్లాడారు. అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు చాగంటి వెంకటరమణ, జెల్లీ కృష్ణ, వెంకటమ్మ, నాగమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

## ఓటర్‌గా నమోదు చేసుకోవాలి



**ప్రజాపక్షం/నడిగూడెం:** అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పల్లా నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వల్లాపురం, సిరిపురం, కొడిపుంజులగూడెం గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తూ ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు యువతకు ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్క హామిని అమలు చేయకుండా మోసం చేసిందని ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలంటే రాకేష్‌రెడ్డిని గెలిపించి ప్రభుత్వ వ్యతిరేకతను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అనంతుల అంజనేయులు, గార్లపాటి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, నూకపంగు ఈదయ్య, ఉపేందర్‌రెడ్డి, ఎలగొండ నారాయణరెడ్డి, ఆజయ్, నాగేందర్, నారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, లింగయ్య, జోగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

## ఓట్ల నమోదు కార్యక్రమం

**ప్రజాపక్షం/అనంతగిరి:** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని శాంతినగర్, లక్కారం, గొండ్రియాల గ్రామాల్లో పట్టభద్రుల ఓట్ల నమోదు కార్యక్రమమును బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నల్ల భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను పట్టభద్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గుగులోతు శ్రీనివాస్, ఎండి అఫ్జల్, అక్బర్, లచ్చిరెడ్డి, గోవర్ధన్, కలకొండ లచ్చయ్య, మన్నె కృష్ణవేణి, హరిష్, నెలకుర్తి ఉషారాణి, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, రాజేష్, అల్లిక నాగయ్య పాల్గొన్నారు.



# సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ ఆరోగ్య సమస్యలతో, ఆపదలో ఉన్న 45 మంది పేద కుటుంబాల లబ్ధిదారులకు రూ.29లక్షల 90వేల విలువ గల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ఇప్పటి వరకు సూర్యాపేట నియోజక వర్గం 484 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు వాటి విలువ రూ.2,15,05,400, ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) రూ.48,10,000 మొత్తంగా రూ.2కోట్ల 63లక్షల 15వేలను సహాయ నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్‌రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, ముస్కు రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు జోరు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ఓటు నమోదు ప్రక్రియ జోరందుకుంది. శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమానికి పట్టణానికి చెందిన పలువురు యువకులు,విద్యావంతులు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తులు అందజేశారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నివాసంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని యువత కలిశారు. ఈ సందర్భంగా ఓటు నమోదు చేసుకున్న యువతను జగదీశ్‌రెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత చైతన్యవంతంగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేలా రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతోనే క్రీడల్లో శోభ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఖేలో ఇండియా తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి నల్గొండ జిల్లా వాలీబాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు మిర్యాలగూడలో ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వచ్చిన క్రీడాకారులతో కళాశాల మైదానం సందడిగా మారింది. బాలికల విభాగంలో 50 మంది, బాలుర విభాగంలో 56 మంది క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎన్విఆర్ బ్రదర్స్ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ అశోక్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు సి సుధాకర్‌రెడ్డి, జె.వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.క్రీడాకారులను ఉద్దేశించి నూకల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణను జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు మట్టారెడ్డి, కె. రవికుమార్, ఎం. వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు గడబోజు అశోకాచారి, మనోహర్, నాగరాజు, నాయిని లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు కొండల్, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.




# నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/కోదాడ:** జాబ్ క్యాలెండర్‌ను అమలు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మొండి చేయి చూపిందని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె నయీం, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పైడిమర్రి సత్యబాబు లు విమర్శించారు. ఆదివారం మున్సిపాలిటి పరిధిలోని కొమరబండలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై అవగాహన కల్పిస్తూ పట్టభద్రులు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బిఆర్ఎస్ హయంలో ఎంపికచేసిన ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలు అందజేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. నిరుద్యోగ విద్యారంగ సమస్యలపై పోరాడిన చరిత్ర రాకేష్‌రెడ్డికి ఉందన్నారు. రాకేష్‌రెడ్డికి పట్టభద్రులు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చీమ నరేష్, ఉపేందర్‌గౌడ్, కరీముల్లా బాబా, అల్వాల వెంకట్, బత్తుల ఉపేందర్, సాధిక్, చలిగంటి వెంకట్, అబ్బు, శ్రీకాంత్, రాజు, నాగుల్, రాజేష్, రమేష్, సైదులు, నర్సయ్య పాల్గొన్నారు.

## చందంపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

### ఎకరాకు రూ. 20వేల నష్టపరిహారం అందించాలి

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి, ఎకరాకు రూ. 20వేల నష్టపరిహారం అందించాలని సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చందంపేట మండలంలో తక్కువ వర్షాపాతం నమోదుకావడంతో రైతులు నీరు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, పంటల దిగుబడి గణనీయం గా తగ్గి పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చందంపేట మండలం గుట్టల ప్రాంతం కావడంతో ఇక్కడి రైతులు వర్షాలపై ఆధార పడి వ్యవసాయాన్ని సాగుచేస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు పడక పోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయని, బోర్లు, బావుల వద్ద వేసిన పంటలు సైతం నీరు లేక ఎండిపోయే పరిస్థితి నెలకొందని తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

**ఏదుల నుండి డిండి ప్రాజెక్టుకు రోజు 0.5 టిఎంసి నీరు సంతోషకరం**

ఏదుల నుండి డిండి ప్రాజెక్టుకు రోజుకు 0.5టీఎంసీల నీరు అందించే నిర్ణయం సంతోషకరమని ఉప్పునూతల వెంకటయ్య హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం రైతులకు, ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మంచి నిర్ణయం తీసుకున్న సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## టియూటిఎఫ్ పట్టణ అధ్యక్షుడిగా జయరాజు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, పాఠశాల విద్య బలోపేతానికి ఐక్య పోరాటాలే శరణ్యమని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాసచారి తెలిపారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని టీచర్స్ భవన్‌లో టీయూటీఎఫ్ మిర్యాలగూడ పట్టణ శాఖ మహాసభను నిర్వహించి ప్రారంభించారు. అనంతరం పట్టణ శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో టీయూటీఎఫ్ పట్టణ శాఖ నూతన అధ్యక్షుడిగా బకల్వాడీ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు కోడిరెక్క జయరాజు, ప్రధాన కార్యదర్శిగా గాంధీ పార్క్ యూపీఎస్ ఉపాధ్యాయురాలు ఎస్కే.రజియాబేగం, ఉపాధ్యక్షులుగా నందిపాడు జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాసచారి, అవంతిపురం టీజీటీడబ్ల్యూయూఆర్‌జేసీ పాఠశాల ఉపాధ్యాయురాలు ఎన్.స్వప్న ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా గాంధీ పార్క్ యూపీఎస్ ఉపాధ్యాయుడు శీలం మధు లింగేశ్వర్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా బకల్వాడీ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు డి.దాశివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## 55 ఏళ్ళయినా చెక్కుచెదరని స్నేహబంధం

**ప్రజాపక్షం/చిట్యాల:** కాలం పరుగులు తీసింది.. బాల్యం జాపకంగా మిగిలింది. చదువులు పూర్తయ్యాయి.. ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో ఒక్కొక్కరు ఒక్కో దారిలో పయనించారు. అయినా, చిన్ననాటి స్నేహబంధం మాత్రం చెక్కుచెదరలేదు. ఐదు దశాబ్దాలకు పైగా కాలం గడిచినా మిత్రులపై మమకారం తగ్గలేదు. వయసు మీదపడినా, మనసులోని బాల్యం మసకబారలేదు. ఇందుకు నిదర్శనంగా నిలిచింది నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 1971/72 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం. సుమారు 55 ఏళ్ళ తర్వాత ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, చిన్ననాటి మధుర జాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. వయసును, కాలాన్ని, దూరభారాలను మరిచి మళ్లీ విద్యార్థి దశలోకి వెళ్లిన అనుభూతిని పొందారు. ఈ బ్యాచ్‌లో మొత్తం 40 మంది విద్యార్థులుండగా వారిలో 12 మంది మిత్రులు ఇప్పటికే మృతి చెందారు. మృతి చెందిన మిత్రుల జాపకార్థం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు మద్దెల మల్లయ్య, బొంతల అంజిరెడ్డి, ఇందిర, నిర్మల, ఉప్పరబోయిన స్వామి, ప్రతాప్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.





## రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని కచలాపురం గ్రామానికి చెందిన గురిజ మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. తన వంతు సాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని పంపించి మానవత్వం చాటుకున్నారు. ఆ మొత్తాన్ని మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, కచలాపురం సర్పంచ్ ఏర్పుల మోహన్ బాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కచలాపురం మాజీ ఉప సర్పంచ్ కంచరకుంట్ల రవీందర్ రెడ్డి, చీకటిమామిడి మాజీ ఉప సర్పంచ్ పొలగోని ప్రకాష్, అశోక్ పాల్గొన్నారు.

## అనాధఆశ్రమంలో అన్నదానం



**ప్రజాపక్షం/మునగాల:** వృద్ధులకు అన్నదానం చేయడం మహాపుణ్యకార్యమని తాడ్వాయి సర్పంచ్ కొలిశెట్టి రాంబాయమ్మ బుచ్చిపాపయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ సమీపంలో ఉన్న ఇందిర అనాధవృద్ధాశ్రమంలో జిల్లేపల్లి శ్రీనివాస్, దివ్యభారతి లకుమారుడు ప్రజ్వల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె పాల్గొని వృద్ధులకు అన్నదానం ప్రారంభించారు. ఇలాంటి ఆశ్రమాల్లో ఉన్న అనాధలకు, వృద్ధులకు, మానసిక వికలాంగులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేనేపల్లి వీరబాబు, సొంపంగు గోపి, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

## మండలంలో గ్రామ కాంగ్రెస్ కమిటీలు రద్దు

**ప్రజాపక్షం /మర్రిగూడ:** మండలంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీల పదవీకాలం ముగిసినందున వాటిని రద్దు చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ తెలిపారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత ఆదేశాల మేరకు గ్రామ కమిటీలను రద్దు చేసినట్లు ఆయన ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలిపారు.పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, నిబద్ధతతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యంగా త్వరలో నూతన గ్రామ శాఖ కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కుల సంఘాల భవనాలు ఐక్యతకు ప్రతీకలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమాజంలో ప్రతీ సామాజిక వర్గ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన పెటిక కుల సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘాల భవనాలు కేవలం భౌతిక నిర్మాణాలు మాత్రమే కావని, ఆయా సామాజిక వర్గాల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సమగ్ర వికాసానికి, పరస్పర సహకారానికి ప్రధాన వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.సంఘ భవనాలను సమాజ శ్రేయస్సుకు, విద్యార్థులు, యువత ఉన్నత స్థాయికి ఎదిగేలా మార్గదర్శకత్వం అందించడానికి, విజ్ఞాన వికాసాలకు, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌చైర్మన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పెటిక కుల సంఘం నాయకులు, సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్థాగతంగా బిజెపిని బలోపేతం చేసే బాధ్యత కార్యకర్తలదే



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ప్రతీ గ్రామంలో సంస్థాగతంగా బిజెపి పార్టీని బలోపేతం చేసే బాధ్యత కార్యకర్తలదేననీ కేంద్ర పథకాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలనీ ఆపార్టీ మాజి ఎంపి డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు.పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో ఆదివారం మండల పార్టీ అధ్యక్షడు మేకల రవీందర్ రెడ్డి అధ్యక్షతన ఆయన నూతన జెండా ఆవిష్కరణ చేసారు.ముఖ్య అథిధిగా హాజరైన ఆయనతో పాటు జిల్లా మాజి అధ్యక్షుడు పాశం భాస్కర్ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్ కార్యక్రమంలో ఉన్నారు.ఈ సందర్భంగా నూతనంగా జిల్లా కౌన్సిల్ మెంబర్ గా ఎన్నకైన పల్లెకాడి బసవయ్యను ఆయన సన్మానించారు.ఛాంద్ పాషా కూతురు పెళ్ళికి బండారు లక్షణ్ 50కి.గ్రా బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల చొక్కారెడ్డి చిక్క కృష్ణ,చెరుకు వెంకటేషం, పశులాది రామచందర్ రావు కేసారం కృష్ణారెడ్డి బైరు వెంకటేష్ మానస మణికంఠ ఎన్నెం శివకుమార్ కొంతం శంకర్,టౌన్ సెక్రెటరీ ఉప్పునూతల నరసింహ తదితర బిజేపి ముఖ్యనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరాల కొండా రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని తమ హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో పట్టభద్రులకు అవసరమైన సహకారం అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ



కార్యక్రమంలో దొండపాడు సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య, చింత్రియాల సర్పంచ్ సకినాల తిరుపతి రావు, మండల యూత్ అధ్యక్షుడు కొడిమల లక్ష్మ య్య, దొండపాడు ఉపసర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ గొనె లక్ష్మి అంకయ్య, కాకునూరి హనుమరెడ్డి పాల్గొన్నారు.

## రూ.2 కోట్ల క్యాష్ గ్రేటర్ మంజూరు

**ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి చేనేత సహకార సంఘంకు తెలంగాణ ఎన్డిసిసిబి రూ.2 కోట్ల క్యాష్ గ్రేటర్ మంజూరు చేసినట్లు చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం స.హ.సం. క్యాష్ గ్రేటర్ లిమిట్ రూ.1.30 కోట్లు ఉండగా వ్యాపారాభివృద్ధి కొరకు ఎక్కువ



సభ్యులకు పని కల్పించేందుకు పరిమితిని పెంచాలని అధికారులను కోరిన వెంటనే పెంచి ఆదివారం తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ సెక్రటరి సురేంద్ర మోహన్ మంజూరు లెటర్ అందజేశా రని పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన సహకరించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,ఏడి శ్రీనివాస్ రావు,ఎన్డిసిసిబి సిఈవో శంక ర్రావు, మేనేజర్ ఇందిరా ప్రియదర్శిని, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు సీత శ్రీశైలం కోశాధి కారి కోడి భిక్షపతి డైరెక్టర్స్ గంజి బసవలింగం మహేశ్వరం నాగలక్ష్మి పాలాది జ్యోతి మేనేజరు రుద్ర ఆంజనేయులు ఉన్నారు.



## మార్కెండేశ్వర స్వామి భజన మండలి స్వర్ణోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి పట్టణంలోని మార్కెండేశ్వర స్వామి భజన మండలి స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం కరపత్రాన్ని ఆ సంఘం సభ్యులు ఆవిష్కరించారు.నవంబరు 1వ తేది నుండి 3వరకు మూడురోజుల పాటు జరిగే కార్యక్రమాలలో మొదటి రోజు ద్వాదశ జ్యోతిర్లింగాల మెట్ల పూజ,భజనలు, రాత్రికి ప్రవచనాలు.రెండవ రోజు లక్ష బిల్వార్చన,ప్రవచనాలు. మూడవ రోజూ పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కొంగరి బాలనర్సింహ్మా తెలిపారు.మార్కెండేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ పాండురంగ స్వామి భజన మండలి మాజి అధ్యక్షుడు చక్రాల నర్సింహ్మా ఉపాధ్యక్షుడు కూరపాటి వెంకటేశం ప్రధాన కార్యదర్శి చెరిపల్లి భాస్కర్ సహాయ కార్యదర్శి గుండు బాలనర్సింహ్మా కోశాధికారి ఈపూరి సత్యనారాయణ భజన మండలి సభ్యులు ఆవిష్కరణలో పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వార్డు సభలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి పురపరిధిలోని అన్ని వార్డుల్లోని ప్రజలు ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పటిష్టమైన ప్రణాళికతో అన్ని చర్యలు తీసుకునేందుకు ఈనెల 31వరకు వార్డు సభలు నిర్వహించనున్నట్లు మొన్సిపల్ కమీషనర్ అంజన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు.ఎల్ నినో దృష్ట్యా ప్రతి వార్డులో ప్రజా సమస్యలు,కరువు ప్రభావిత పరిస్థితులుతాగునీట సరఫరా,విద్యుత్, పారిశుధ్యం, ఇతర మౌళిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారాలకు అవసరమైన చర్యలను చేపట్టుటకు ఈ వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు .వార్డు వారీగా,సభా స్థలాలు,అధికారుల కెటాయింపుల షెడ్యూల్‌ను ఆఫీస్ బోర్డులో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు.ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను విన్నవించుకోవాలని సూచించారు.

## జాతీయ క్రీడలకు అక్షిత ఎంపిక అభినందనీయం



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలోని చాకలిశేరిపల్లి గ్రామానికి చెందిన అక్షిత జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించడంతోపాటు, భారతజట్టుకు ఎంపిక కావడం రాష్ట్రానికే గర్వకారణమని మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం రవీంద్రకుమార్ అక్షితను శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాకంక్షలు తెలిపారు. రవీంద్రకుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని అంతర్జాతీయస్థాయిలో భారతజట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని, భవిష్యత్తులో ఉత్తమ ప్రతిభ కనబర్చి మరిన్ని విజయాలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ మాచర్ల శ్రీశైలం, ఉపసర్పంచ్ పగడాల వెంకటయ్య, ఆకుల జగతయ్య తదితరులు పాల్గొన్నారు.